సాక్షి బాపట్ల

శనివారం । 25 । ఫిబ్రవరి । 2023



పెరుగుతున్న పల్నాటి వీరాచారం

కారెంపూడి: పల్నాటి వీరాచారం పెరుగుతోంది. శుక్రవారం ప్రకాశం జిల్లా నుంచి పది మంది వీరాచారవంతులు కారెంపూడి వచ్చి వీరుల ఆయుధాలకు పునఃప్రతిష్ట చేయించుకున్నారు.



నాట్కో రూ.4.2 లక్షల విరాళం

గుంటూరు వెస్ట్: టీబీ పేషెంట్ల పోషక ఆహారం కోసం నాట్కో ఫార్మా కంపెనీ ప్రతినిధులు కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డికి రూ.4.20 లక్షల చెక్కును కలెక్టరేట్‌లో అందజేశారు.




బాధ్యతలు స్వీకరించిన కర్నాటి

దుర్గగుడి చైర్మన్‌గా కర్నాటి రాంబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి హాజరయ్యారు. - ఇంద్రకీలాద్రి

న్యూస్‌రీల్

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 551.70 అడుగుల వద్ద ఉంది. ఇది 213.5390 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 10,350, ఎడమ కాలువకు 8,986, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 17,203, ఎస్ఎల్‌బీసీకి 2,200, వరద కాలువకు 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 39,059 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 4,553 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 825.60 అడుగుల వద్ద ఉంది. ఇది 45.3174 టీఎంసీలకు సమానం.

ఎన్నికల పరిశీలకులుగా కోన శశిధర్

బాపట్ల: ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులుగా కోన శశిధర్‌ను నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల ప్రక్రియను కోన పరిశీలిస్తారు. ఎన్నికల నిర్వహణలో సమస్యలు ఉంటే 93919 23114 సెల్ నంబరుకు ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉందని ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది.

యార్డులో 1,12,995 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,06,231 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,12,995 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.21,800 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.25,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 80,610 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఏప్రిల్ 4న 'కలెక్టర్ ట్రోఫీ'

పిడుగురాళ్ల: పల్నాడు జిల్లా ఏర్పాటై ఏప్రిల్ 4వ తేదీకి సంవత్సరం కావస్తున్నందున అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, యువతను కలుపుకొని కలెక్టర్ ట్రోఫీ పేరుతో క్రీడా పోటీలను నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. శుక్రవారం పిడుగురాళ్ల పట్టణంలో ఓ కార్యక్రమానికి విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో రెవెన్యూ, సివిల్, వెల్ఫేర్, లా అండర్ ఆర్డర్ ప్రభుత్వ ఉద్యోగులను నాలుగు విభాగాలుగా ఏర్పాటు చేసి ఈ ట్రోఫీని నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో యువతను కూడా భాగస్వాములను చేసి వారిని కూడా మండలానికి ఒక జట్టును ఎంపిక చేసి పోటీలు నిర్వహించటం జరుగుతుందని పేర్కొన్నారు. మార్చి 15 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు కలెక్టర్ ట్రోఫీ క్రీడలను నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు వివరించారు. మార్చి, ఏప్రిల్‌లో పరీక్షలు ఉంటాయి కాబట్టి మే నెలలో యువతకు పోటీలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తామని తెలియజేశారు.

త్రికోటేశ్వరుడికి బంగారు రుద్రాక్ష మాల



నరసరావుపేట రూరల్: కోటప్పకొండపై కొలువైన త్రికోటేశ్వరస్వామికి చిలకలూరిపేటకు చెందిన విడదల వేణుగోపీనాథ్, స్ఫూర్తి దంపతులు రూ.4.40 లక్షల విలువైన 80 గ్రాముల బంగారు రుద్రాక్షమాలను బహూకరించారు. ఆలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో స్వామి సన్నిధిలో బంగారు రుద్రాక్ష మాలను దాతలు ఆలయ ఈవో వేమూరి గోపికి అందజేశారు. బంగారు రుద్రాక్ష మాలతో స్వామి వారికి అభిషేకం నిర్వహించి దాతలకు తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో అర్చక స్వాములు, సిబ్బంది పాల్గొన్నారు.





రాష్ట్ర నూతన గవర్నర్‌గా జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రశాంత్‌కుమార్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పలువురు మంత్రులు, న్యాయమూర్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు శుభాభినందనలు తెలుపుతున్న మంత్రులు మేరుగ నాగార్జున, అంబటి రాంబాబు, విడదల రజిని -సాక్షి ఫొటోగ్రాఫర్

బ్లూటూత్‌తో సైబర్ మాయ

- బ్లూబగ్గింగ్‌తో స్మార్ట్ ఫోన్‌ల హ్యాకింగ్
- బ్లూబగ్గింగ్ సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- పరిచయం లేని వ్యక్తులు బ్లూటూత్ ద్వారా పంపే పెయిరింగ్ రిక్వెస్ట్‌లకు స్పందించవద్దు
- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



బ్లూబగ్గింగ్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోస్టర్

బాపట్లటౌన్: బ్లూటూత్ ద్వారా జరిగే సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం చేతికి పెట్టుకున్న డిజిటల్ వాచ్, చెవులకు ధరించిన ఇయర్‌పాడ్ పనిచేయాలన్నా, కారులోని మ్యూజిక్ సిస్టమ్‌తో అనుసంధానమవ్వాలన్నా బ్లూటూత్‌ను ఉపయోగిస్తున్నారు. ప్రతి ఒక్కరు హ్యాండ్ ఫ్రీ సాంకేతికతలో భాగంగా వైర్‌లెస్ పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నారని, దీన్ని ఆసరాగా తీసుకున్న సైబర్ నేరగాళ్లు బ్లూబగ్గింగ్ పేరిట మోసం చేస్తున్నారన్నారు. బహిరంగ ప్రదేశాల్లో 10 మీటర్ల దూరంలో బ్లూటూత్ ఆన్‌లో ఉన్న మొబైల్స్‌కు సైబర్ నేరగాళ్లు పెయిర్ రిక్వెస్ట్ పంపిస్తారన్నారు. పొరపాటున కనెక్ట్ అయితే మీ మొబైల్‌లోకి మాల్వేర్ పంపిస్తారన్నారు. మొబైల్ ఫోన్‌లోని ఫొటోస్, ఫైల్స్, ఇతర ముఖ్యమైన డేటాను దొంగిలించి డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్ చేస్తారన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఉన్నప్పుడు అవసరమైతే తప్ప మిగిలిన అన్ని సమయాల్లో బ్లూటూత్ ఆఫ్ చేయాలని సూచించారు. గుర్తుతెలియని పరికరాలు, పరిచయంలేని వ్యక్తులు బ్లూటూత్ ద్వారా పంపే పెయిరింగ్ రిక్వెస్ట్‌లకు స్పందించవద్దని చెప్పారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, బహిరంగ ప్రాంతాల్లోని ఉచిత వైఫైను వినియోగించవద్దన్నారు. డేటాలో హెచ్చుతగ్గులను గమనిస్తూ ఉండాలని, అదనపు భద్రతకు వీపీఎ న్ వినియోగించాలని సూచించారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

చీరాల: హత్య కేసులో ఓ నిందితుడికి కోర్టు జీవిత ఖైదు, జరిమానా విధించింది. చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు, రూ.5 వేల జరిమానా విధించేలా చర్యలు తీసుకున్న పోలీసులను శుక్రవారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. 2017లో చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మృతుడు కావాటి ఆదినారాయణ ఇంటి వద్ద ఉండగా ముద్దాయి సాతుపాటి బాలు తన స్నేహితులతో ఇంటికి వచ్చాడు. ఆడపిల్ల ఉన్న ఇంటికి కుర్రాళ్లను ఎందుకు తీసుకువస్తావని ఆదినారాయణ అనడంతో బాలు ఆదినారాయణ ముఖంపై కొట్టి ఇంట్లో ఉన్న కత్తిపీటను తీసుకువచ్చి తల వెనుక నరికాడు. తీవ్ర గాయాలైన ఆదినారాయణను చీరాల ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లగా మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి సోదరి అలివేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తు అధికారి టూటౌన్ సీఐ జి.రామారావు ముద్దాయిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ వేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ పి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో టూటౌన్ సీఐ సోమశేఖర్, కోర్టు హెడ్ కానిస్టేబుల్ ఎం.వెంకటేశ్వర్లు సాక్షులను ఒంగోలు కోర్టులో హాజరుపరిచారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడికి జీవితఖైదు, రూ.5 వేలు జరిమానా విధించారు. కేసులో ముద్దాయికి శిక్ష పడేలా చేసిన అధికారులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

అధిక లాభం పేరిట మోసం

ఖాతా నుంచి రూ.20 లక్షలకుపైగా మాయం

తెనాలిరూరల్: ట్రేడ్ మార్కెటింగ్‌లో కొద్ది మొత్తం చెల్లిస్తే అధిక లాభం చేకూరుస్తామని మొబైల్ యాప్‌లో వచ్చిన లింక్‌ను క్లిక్ చేసిన యువతి లక్షల్లో నష్టపోయి పోలీసులను ఆశ్రయించింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ఐతానగర్‌కు చెందిన చేకూరి తరణి సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తోంది. ప్రస్తుతం వర్క్ ఫ్రం హోంలో భాగంగా ఇంటి వద్ద నుంచే విధులు నిర్వహిస్తోంది. ఇటీవల కాలంలో తన ఇన్‌స్టాగామ్‌లో ఓ యాప్ లింక్ వచ్చింది. ట్రేడ్ మార్కెట్ యాప్‌గా ఉన్న ఆ లింక్‌ను క్లిక్ చేసి, కొద్ది మొత్తంలో డిపాజిట్‌గా చెల్లిస్తే కొద్ది రోజుల్లో అధిక లాభం వస్తుందని ఉంది. తొలి విడతగా యువతి రూ.2 వేలు చెల్లించగా ఆమెకు రూ.60 వేలు వచ్చాయి. దీంతో యాప్‌పై నమ్మకం కలగడంతో తరచూ నగదు జమ చేస్తూ వచ్చింది. ఈ క్రమంలో ఈ నెల 9వ తేదీ తన ఖాతా సరిచూసుకోగా మొత్తం రూ.20,66,000 మాయం అయినట్టు తెలుసుకుంది. మోసపోయినట్టు గ్రహించి పోలీసులను ఆశ్రయించగా, టూటౌన్ పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు.

నిర్మాణ రంగ సమస్యలు పరిష్కరించండి

గుణదల(విజయవాడ తూర్పు): నిర్మాణ రంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును పలువురు బిల్డర్లు కోరారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, క్రెడాయ్, నెరెడ్కో ప్రతినిధులు మంత్రిని శుక్రవారం మర్యాదపూర్వకంగా దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. రాష్ట్రంలో నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న ఒడుదొడుకుల కారణంగా ఇబ్బందులు పడుతున్నామని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంత్రికి వారు వినతిపత్రం ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో మూడు అసోసియేషన్‌ల ప్రతినిధులు, బిల్డర్లు రమణరావు, ఎ.నాగమల్లేశ్వరరావు, ఎస్.పి.రెడ్డి, విజయ్‌కుమార్, హరిప్రసాద్‌రెడ్డి, బి.ఎస్.కె.పట్నాయక్ ఉన్నారు.

జీజీహెచ్‌లో ఉచిత న్యాయ సేవలు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రత్నకుమార్, పక్కన డాక్టర్ కిరణ్, సతీష్‌కుమార్

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్‌కు వివిధ సమస్యలతో వచ్చే బాధితులకు ఉచితంగా న్యాయ సలహాలను అందిస్తామని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.రత్నకుమార్ అన్నారు. శుక్రవారం జీజీహెచ్ మానసిక వైద్య విభాగంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కుటుంబ పరమైన, వ్యక్తిగత సమస్యలు ఉన్నా ఆసుపత్రిలోని న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకుని వస్తే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఆసుపత్రిలో తమ సంస్థ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తారని వెల్లడించారు. మహిళల సమస్యలను పరిష్కరించడానికి దిశ విభాగాన్ని కూడా అందుబాటులో ఉంచామని తెలిపారు. ఆసుపత్రి వైద్య సిబ్బంది రోగులకు అందిస్తున్న సేవలను అభినందిస్తూ ఇంకా మెరుగైన వైద్య సేవలను అందించాలని ఆయన సూచించారు. అనంతరం బాధితులకు ఎలాంటి సేవలు అందుతున్నాయో వారిని అడిగి తెలుసుకున్నారు. న్యాయ సేవలు పొందే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో మానసిక వైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తులవెంకట సతీష్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ సాయి కిరణ్, డాక్టర్ మినిషా, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ సుల్తానా, సంస్థ న్యాయవాది కట్టా కాళిదాసు పాల్గొన్నారు.

రూ.344 కోట్లతో ఎంటీఎంసీ తొలి బడ్జెట్

- అమృత్–2 పథకం కింద రూ.51 కోట్ల నిధులు
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)



బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, కమిషనర్ శారదాదేవి, అడిషనల్ కమిషనర్ హేమమాలిని

మంగళగిరి: మంగళగిరి– తాడేపల్లి మున్సిపాలిటీలు కలిపి నగరపాలక సంస్థగా ఆవిర్భవించిన తరువాత తొలిసారిగా రూ.344 కోట్లతో బడ్జెట్‌ను సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పేర్కొన్నారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ యు.శారదాదేవి అధ్యక్షతన తొలి బడ్జెట్ సమావేశం నిర్వహించారు. 2022–23 సంవత్సరం సవరించిన బడ్జెట్ అంచనాల ప్రారంభ నిల్వ రూ.105,03,22,651 చూపగా మూల ధనపు ఖాతా ఖర్చులు రూ.227,3071,451గా అంచనా వేయబడి ముగింపు నిల్వ రూ.63,43,07,816లుగా చూపారు. 2023–24 సంవత్సరపు బడ్జెట్ అంచనాలకు ప్రారంభ నిల్వ రూ.63,43,07,816లుగా చూపగా సాధారణ మూల ధనపు ఖాతా మొత్తం జమలు రూ.3,43,73,28,816 అంచనా వేశారు. సాధారణ మూల ధనపు ఖర్చుల కింద రూ.341,84,94,987 అంచనా వేయబడి ముగింపు నిల్వగా రూ.1,88,33829 అంచనా వేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 190 చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ ఏర్పడిన తరువాత తొలిసారిగా రూ.344 కోట్లతో భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఎంటీఎంసీకి రూ.130 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా అమృత్–2 పథకంలో భాగంగా కేవలం తాగు నీటి సరఫరా కోసం రూ.51 కోట్ల నిధులను కేటాయించడం శుభ పరిణామం అన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ హేమమాలిని, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, డీఈ కృష్ణారెడ్డి ఆర్ఓలు మురళి, బాబూరావు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు ఏర్పాట్లు

ఈ నెల 26 నుంచి మార్చి 7వ తేదీ వరకు నిర్వహణ

- ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 192 కేంద్రాలు
- హాజరుకానున్న 35,881 మంది విద్యార్థులు



సమావేశంలో ఆర్ఐవో సునీత, పక్కన శేఖర్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సైన్స్ కోర్సుల విద్యార్థులకు ఆదివారం నుంచి మార్చి 7వ తేదీ వరకు జరగనున్న ప్రయోగ పరీక్షలు (ప్రాక్టికల్స్)కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంటర్మీడియెట్ విద్య ఆర్ఐవో గన్నెపూడి సునీత తెలిపారు. సాంబశివపేటలోని ఆర్ఐవో కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రాక్టికల్స్‌కు హాజరు కానున్న 35,881 మంది విద్యార్థులకు 192 కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. నాన్ జంబ్లింగ్ విధానంలో జరిగే ప్రాక్టికల్స్‌కు హాజరుకానున్న విద్యార్థుల్లో ఎంపీసీ 28,772 మంది, బైపీసీ 7,117 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12, తిరిగి మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు జరిగే ప్రాక్టికల్స్‌కు హాల్ టికెట్ కలిగిన విద్యార్థులను అర్ధగంట ముందుగా కేంద్రాల్లోకి అనుమతిస్తామని తెలిపారు. మూడు స్పెల్స్‌లో జరగనున్న ప్రాక్టికల్స్‌లో 400 మందికి మించిన విద్యార్థులు ఉన్న కళాశాలల్లో అదనంగా మరో ప్రాక్టికల్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఏ, బీ సెంటర్లుగా విభజించినట్లు చెప్పారు.

అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలతో నిఘా

ప్రాక్టికల్స్ సెంటర్లలో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామని, ఇంటర్‌బోర్డు నుంచి ఉన్నతాధికారులు లైవ్ స్ట్రీమింగ్ విధానంలో ప్రత్యక్షంగా పరిశీలిస్తారని చెప్పారు. కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్ ఒక్కరే సెల్ ఫోన్ కలిగిఉండాలని, మిగిలిన సిబ్బంది ఎవ్వరి దగ్గర ఫోన్లు ఉండేందుకు అనుమతి లేదన్నారు. ప్రాక్టికల్స్ పూర్తవ్వగానే అక్కడికక్కడే పేపర్ల వాల్యూయేషన్ పూర్తి చేసి, సీల్డ్ కవర్‌లో సీఎస్‌కు అందజేయాలని పేర్కొన్నారు. ఆకస్మిక తనిఖీలకు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతి ఒక్క విద్యార్థికీ హాల్ టికెట్ ఇవ్వాలని యాజమాన్యాలను ఆదేశించారు. విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకున్నా, కళాశాలల్లోని ప్రయోగ కేంద్రాల్లో ఏమైనా సమస్యలున్నట్లయితే గుంటూరు ఆర్ఐవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ (0863–2228528)కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో డీఈసీ సభ్యుడు టి.శేఖర్‌బాబు పాల్గొన్నారు.

సీఎం పర్యటనను సమన్వయంతో నిర్వహించాలి

- సీఎం పర్యటనపై అధికారులకు దిశానిర్దేశం చేసిన కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి
- హెలిప్యాడ్‌ను పరిశీలించిన ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్, పక్కన సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ

గుంటూరు వెస్ట్: వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ మూడో విడత ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమానికి ఈ నెల 27న తెనాలి రానున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో 27న ఉదయం 9:50 గంటలకు సీఎం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి 10:15కు తెనాలిలోని కవిరాజు లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారన్నారు. 10:35 గంటలకు సభావేదిక వద్దకు వస్తారని చెప్పారు. అక్కడ సుమారు గంటా 45 నిమిషాలు ఉంటారని తెలిపారు. అనంతరం 12:15కు హెలిప్యాడ్‌కు చేరుకుని తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారని వివరించారు. ఆహ్వానితులు, ప్రజలకు ట్రాఫిక్, మంచినీరు, విద్యుత్ తదితర అవసరాలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అర్బన్ ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు

తెనాలి: సీఎం ఈ నెల 27వ తేదీ పట్టణానికి విచ్చేయనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ శుక్రవారం సమీక్షించారు. అవసరమైన సూచనలను చేశారు. ముందుగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగే బహిరంగ సభా ప్రాంతం, కవిరాజ నగర్‌లోని హెలిప్యాడ్ ప్రాంతాన్ని అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మార్కెట్ యార్డు, చుట్టుపక్కల ప్రాంతాల్లో దారి వెంట బారికేడ్లను నిర్మించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ వద్ద గ్రీన్‌రూమ్, టెంట్లను ఏర్పాటు చేయాలని, రైతులు సభకు వచ్చి వెళ్లేందుకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ, లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీ అనిల్‌కుమార్, క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

46వ గుడారాల పండుగకు ముమ్మర ఏర్పాట్లు

మార్చి 2 నుంచి 5వ తేదీ వరకు పగలు, రాత్రి ప్రత్యేక ప్రార్థనలు

గుంటూరు రూరల్: హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గుడారాల పండుగ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గోరంట్ల గ్రామం అమరావతిరోడ్డులో ఉన్న హోసన్న మందిర్ సమీపంలో వందల ఎకరాల్లో భారీ టెంట్లతో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మార్చి 2న సాయంత్రం 5 గంటల నుంచి ప్రారంభమై 5వ తేదీ మధ్యాహ్నం వరకు జరిగే 46వ అంతర్జాతీయ గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో జరిగే ప్రత్యేక ప్రార్థనలకు విడివిడిగా భారీ స్టేజీలను ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక ప్రార్థనల్లో నాలుగు రోజులకు కలిపి 15–20 లక్షల మంది భక్తులు పాల్గొంటారని అంచనాలు ఉన్నాయి. ప్రతి ఏటా రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా భారతదేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన భక్తులు, దేశవిదేశాల నుంచి భక్తులు లక్షల్లో పాల్గొంటారు. భక్తుల సౌకర్యార్థం రాకపోకలకు ఆర్టీసీ, పోలీస్, రైల్వే, హెల్త్ తదితర శాఖల సిబ్బంది తగిన సౌకర్యాల ఏర్పాట్లలో ఇప్పటికే నిమగ్నమయ్యారు. హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ తదితరులు భక్తులకు క్రీస్తు సందేశాన్ని అందించనున్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంపునకు ప్రత్యేక చర్యలు

- ఏపీఎస్ఆర్టీసీ ఈడీ ఆదంసాహెబ్
- ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం


ఫిల్లింగ్ పాయింట్‌ని ప్రారంభిస్తున్న ఈడీ ఆదంసాహెబ్

వేటపాలెం: ఏపీఎస్ఆర్టీసీకి ఆదాయం పెంపుకోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కే ఆదం సాహెబ్ పేర్కొన్నారు. వేటపాలెం మండలం వేటపాలెం-చీరాల ప్రధాన రోడ్డు పక్కన పాత ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిల్లింగ్ స్టేషన్‌ని ఈడీ శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరు రీజనల్ పరిధిలో మొట్టమొదటిసారిగా వేటపాలెంలో ఫిల్లింగ్ స్టేషన్‌ని ఏర్పాటు చేశామన్నారు. ఈ స్టేషన్ ద్వారా వాహనదారులకు నాణ్యమైన డీజిల్, పెట్రోల్ అందుతుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏపీఎస్ఆర్టీసీకి సంబంధించిన ఖాళీ స్థలాలను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. సంస్థ ఆదాయం పెంపుకోసం వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్గో సేవల ద్వారా ప్రతి ఏడాది సంస్థకు రూ.250 కోట్లు ఆదాయం సమకూర్చుతున్నట్లు తెలిపారు. రాబోవు కాలంలో ఆదాయాన్ని రూ.500 కోట్లకి పెంచేవిదంగా చర్యలు తీసుకుంటామన్నారు. దీనితో పాటు కమర్షియల్ ద్వారా కూడా మరో రూ.500 కోట్లు ఆదాయ సమకూర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. వివిధ మార్గాల ద్వారా సంస్థకు వచ్చిన ఆదాయంతో ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించడానికి కృషిచేస్తామని వివరించారు. కార్యక్రమంలో కమర్షియల్ చీఫ్ మేనేజర్ పీ చంద్రశేఖర్, వివిధ ఆర్టీసీ డిపో మేనేజర్లు శ్రీనివాసరెడ్డి, అజత కుమారి, కే శ్యామల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి టెన్నిస్ టోర్నమెంట్

నరసరావుపేటఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల క్రీడా మైదానంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు నరసరావుపేట టెన్నిస్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు నంద్యాల నరసారెడ్డి, కార్యదర్శి మిరియాల ప్రసాదు, ఇన్‌చార్జి కె.రవిశంకర్ శుక్రవారం తెలిపారు. టోర్నమెంట్‌లో పురుషులు డబుల్స్, 45సంవత్సరాలు డబుల్స్, 55 సంవత్సరాలు డబుల్స్, 65 సంవత్సరాలు డబుల్స్ విభాగాలలో పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఇప్పటివరకు 65 టీమ్‌లు తమ పేర్లు నమోదు చేసుకున్నాయన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావడం అభినందనీయం

రాజ్యసభసభ్యుడు
మోపిదేవి వెంకట రమణారావు


స్కూలు బస్సును ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు

రేపల్లెరూరల్: విద్యాలయాల అభివృద్ధికి ప్రభుత్వంతోపాటు దాతలు ముందుకు రావటం అభినందనీయమని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. మండలంలోని వడ్డీవారిపాలెం గ్రామంలో ఉన్న సావిత్రి గణేష్ జెడ్పీ హైస్కూలుకు యూఎస్ఏకు చెందిన జొన్నగడ్డ సుధాకర్ తన తల్లి సత్యవతి జ్ఞాపకార్థం రూ.22లక్షల వ్యయంతో ఒక బస్సును, మహానటి సినీ బృందం మరో బస్సును వితరణ చేసింది. స్కూలు ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో బస్సులను ఎంపీ మోపిదేవి ప్రారంభించారు. మోపిదేవి మాట్లాడుతూ వెనకబడిన కుగ్రామంలోని పేద విద్యార్థులు చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్న సంకల్పంతో మహానటి సావిత్రమ్మ ఏర్పాటుచేసిన పాఠశాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. నాడు-నేడు పథకం ద్వారా రూ.లక్షలు వెచ్చించి అభివృద్ధి చేశామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా విద్యార్థుల అభ్యున్నతికై విద్యారంగంలో అనేక మార్పులు తీసుకువచ్చారని పేర్కొన్నా రు. అందులో భాగంగానే ఆంగ్ల బోధనను ప్రవేశపెట్టారన్నారు. మాతృభూమిని మర్చిపోకుండా రెండు దశాబ్దాలుగా డాక్టర్ సుధాకర్ సేవలు అందిస్తున్నారన్నారు. విద్యార్థులు సుధాకర్‌ను ఆదర్శంగా తీసుకుని మంచిస్థానంలో నిలవాలని కోరారు. సుధాకర్-ఉమామహేశ్వరి దంపతులను సత్కరించారు. బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జున రావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, సర్పంచ్ వడ్డీ సునీత శ్రీనివాస్, హెచ్ఎం మట్టా జ్యోత్స్న ఉన్నారు.

క్రీడల్లో ప్రావీణ్యంతో సవాళ్లను అధిగమించొచ్చు

ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డీన్ ప్రొఫెసర్ జాన్సన్


క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ప్రిన్సిపాల్ నాగభూషణం

గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించిన విద్యార్థులకు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థతతో అధిగమించగలరని ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ పి.జాన్సన్ పేర్కొన్నారు. శుక్రవారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో స్పర్ధ పేరుతో ఏర్పాటు చేసిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. క్రీడాంశాల్లో శిక్షణ పొందిన విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా గెలుపు, ఓటములను తేలిగ్గా తీసుకునే ఆత్మ విశ్వాసం కలుగుతాయని అన్నారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. ముందుగా క్రీడాజ్యోతిని వెలిగించిన ప్రొఫెసర్ జాన్సన్, పావురాలను, బెలూన్లను ఎగురవేశారు. కార్యక్రమంలో రాష్ట్రస్థాయి కబడ్డీ రిఫరీ వెలగా అమ్మయ్య, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, గౌరవ చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రవికుమార్, ఫార్మా.డి డైరెక్టర్ పి. సీతారామయ్య, ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ అజిత్‌బాబు, ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతే వైఎస్సార్ సీపీ లక్ష్యం

బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీటా


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీసీ సంఘం నాయకులు

బాపట్ల: బీసీల అభ్యున్నతే వైఎస్సార్ సీపీ లక్ష్యమని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీటా వేణుగోపాల్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా నాయకత్వంలో పలువురికి అవకాశం కల్పించటంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. తొలుత జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకున్న పార్టీలను చూశామని, బీసీలను పాలకవర్గంలో భాగస్వామ్యం చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని పేర్కొన్నారు. బాపట్ల నియోజకవర్గంలో పార్టీ కోసం అన్నివర్గాలకు పదవులు వచ్చేలా కృషి చేసిన ఎమ్మెల్యే కోన రఘుపతికి కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులుగా నియమించిన చల్లా రామయ్య మాట్లాడుతూ మహానేత డాక్టరు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దివ్యాంగులకు పెన్షన్లు పెంపుదల చేస్తే దివ్యాంగుల సంక్షేమానికి అనునిత్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. విద్యాభివృద్ధికి అనునిత్యం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని విద్యార్థి విభాగం నాయకులు సోహిత్ యాదవ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ గవిని కృష్ణమూర్తి, బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు గొర్ల శ్రీనివాస రావు కర్లపాలెం మండల ఉపాధ్యక్షులు పందరబోయిన సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ పిన్నిబోయిన ప్రసాద్, సీనియర్ బీసీ నాయకులు ఎనుముల భాస్కర్‌గౌడ్, సీనియర్ అడ్వకేట్‌లు లంబు సాంబయ్య యాదవ్, అంగలకుదురు నటరాజన్, భావపురి విద్యాసంస్థల డైరెక్టర్ ఆవుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మాతృమరణాలు మరెక్కడా జరగకుండా చూడండి

పల్నాడు జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి
డాక్టర్ శోభారాణి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్లు, కమిటీ సభ్యులు

నరసరావుపేట: మాతృమరణాలు ఎక్కడా చోటుచేసుకోకుండా ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు కృషిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి.శోభారాణి ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో మాతృ మరణాలపై ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి మాసంలో చోటుచేసుకున్న మాతృ మరణాలను కమిటీ సభ్యులు ప్రైవేటు, ప్రభుత్వ వైద్యులు, బాధితులను విచారించి మరణం సంభవించడానికి గల కారణాలను విశ్లేషించారు. తదుపరి ఇలాంటి మరణాలు ఎక్కడా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తదుపరి లింగ నిర్ధారణ చట్టం, 1994పై పోస్టరు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ వైద్యశాలల పర్యవేక్షణాధికారి, నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బీవీ.రంగారావు, జిల్లా డెప్యూటీ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ గీతాంజలి, ఐసీడీఎస్ పీడీ డాక్టర్ నాగపద్మజ, డాక్టర్లు మంత్రూ నాయక్, వసంత రాయ, హనుమకుమార్, ఆశాలు, ఏఎన్ఎంలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రదర్శనకు ఎంపిక


ప్రశంసాపత్రం, మెమెంటో అందుకుంటున్న విద్యార్థి

అద్దంకి: రాష్ట్రస్థాయి సైన్స్ ప్రదర్శనకు మండంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థుల ప్రాజెక్టులు ఎంపిక య్యాయి. 9వ తరగతి విద్యార్థి షేక్ మహ్మద్ అబ్దుల్ ఖుర్షిద్ అఫ్జల్ ప్రదర్శించిన ప్రాజెక్టు ఎంపికైనట్లు హెచ్ఎం కేవీ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి, 24న బాపట్లలో నిర్వహించిన జిల్లాస్థాయి ప్రదర్శనలో ద్వితీయ స్థానం పొందిన విద్యార్థి ప్రాజెక్టు 'ఎకో ఫ్రెండ్లీ పియాజో ఎలక్ట్రిసిటీ' ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థికి గైడ్‌గా ఫిజిక్స్ ఉపాధ్యాయుడు ఎస్ జే శ్రీనివాసరావు వ్యవహరించారు. అలాగే మరో విద్యార్థి ఎస్వీ పార్థసాయి తయారుచేసిన 'మదర్స్ స్మార్ట్ అండ్ హెల్దీ కిచెన్' ప్రాజెక్టు జిల్లాలో ద్వితీయ స్థానం పొంది రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైందని తెలిపారు. విద్యార్థులకు గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయుడు శ్రీనివాసరావును హెచ్ఎం, ఉపాధ్యాయులు ప్రమీలారాణి, పీ విజయలక్ష్మి, బాబూరావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ టీ ఉమాదేవి అభినందించారు.

పదిలో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు


మాట్లాడుతున్న ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి నూరు శాతం ఉత్తీర్ణత నమోదు చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని పాఠశాల విద్య ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు పేర్కొన్నారు. గుంటూరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్ష భవన్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్జేడీ సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులను అన్ని సబ్జెక్టుల్లో పూర్తిస్థాయిలో సామర్థ్యాన్ని మెరుగుపరచుకునేలా అమల్లోకి తెచ్చిన 30 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రకారం తరగతులను నిర్వహించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకుని చదివించాలని అన్నారు. డీఈఓ పి.శైలజ మాట్లాడుతూ 8వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేసిన బైజూస్ ట్యాబ్‌లను పూర్తిస్థాయిలో వినియోగించాలని సూచించారు. సమావేశంలో గుంటూరు డీవైఈఓ కె.సుధాకర్ రెడ్డి, డైట్ ప్రిన్సిపాల్ సుభానీ, ఎంఈఓ అబ్దుల్ ఖుద్దూస్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం పాల్గొన్నారు.

పొట్టకూటికి వచ్చి విగతజీవిగా..

కారు ఢీకొని గ్యాస్ స్టౌ మెకానిక్ మృతి

నాగులుప్పలపాడు: బైక్‌పై ఊరూరా తిరుగుతూ గ్యాస్ స్టౌ మరమ్మతులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే వ్యక్తిని కారు రూపంలో మృత్యువు బలితీసుకుంది. ఈ ఘటన శుక్రవారం ఉప్పుగుండూరు- నాగులుప్పలపాడు మధ్య 216 జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. నాగులుప్పలపాడు ఎస్సై హరిబాబు కథనం మేరకు.. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన చందు బ్రహ్మేశ్వరరావు(45) గ్రామాల్లో మోటారుసైకిల్‌పై తిరుగుతూ గ్యాస్ స్టౌలు బాగుచేస్తుంటాడు. రోజూలాగే శుక్రవారం పని చేసుకుని ఒంగోలు నుంచి చీరాలకు తన మోటార్ సైకిల్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో చీరాల నుంచి ఒంగోలు వైపునకు వేగంగా వస్తున్న ఓ కారు ఉప్పుగుండూరు-నాగులుప్పలపాడు మధ్య బైక్‌ను ఢీకొట్టడంతో బ్రహ్మేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళా పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలిగా అరుణ


ఎం.అరుణ

కొల్లూరు: గ్రామ, వార్డు సచివాలయాల మహిళా పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా అధ్యక్షురాలుగా కొల్లూరు మండలం ఈపూరు సచివాలయ మహిళా పోలీసు ఎం.అరుణను ఎన్నుకున్నారు. గురువారం బాపట్లలో జరిగిన సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు జిల్లా అడహక్ కమిటీలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. జనరల్ సెక్రటరీగా కె.కామేశ్వరి, అదనపు జనరల్ సెక్రటరీగా డి.దివ్యవాణి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా శివపార్వతి, వైస్‌ప్రెసిడెంట్‌గా బి.బిందు, వైస్ ప్రెసిడెంట్‌గా డి.ఆదిలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా ఆర్.మల్లేశ్వరి, బి.అపర్ణ, హిమబిందు, పి.రేవతి, ట్రెజరర్‌గా డి.మేఘమాల, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.జైన్, జాయింట్ సెక్రటరీలుగా బిందు, బి.అంబిక, ఎస్‌కే.షభన, బి.జ్యోతి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా పి.నాగమణి, హేమ, ఎం. కౌశల్య, కె.తిరుమల, డి.ప్రసన్నలు ఎంపికయ్యారు. జిల్లా కమిటీ అధ్యక్షురాలిగా ఎంపికైన అరుణను సచివాలయ సిబ్బంది, మండలంలోని సచివాలయ మహిళా పోలీసులు అభినందించారు.

పట్టా భూములకు మాత్రమే క్రమబద్ధీకరణ'

పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్


పాకాలపాడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న జేసీ శ్యాం ప్రసాద్

సత్తెనపల్లి: పట్టా భూములకు మాత్రమే సాదా బైనామా క్రమబద్ధీకరణ జరుగుతుందని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ చెప్పారు. సత్తెనపల్లి మండలం పాకాలపాడు గ్రామ సచివాలయంలో శుక్రవారం సాదా బైనామా క్రమబద్ధీకరణపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తెల్లకాగితాలపై షరతులు లేకుండా వివాదరహితంగా ఉండి 2021 నవంబర్ ఒకటికి ముందు రాసుకున్న అన్ రిజిస్టర్డ్ కాగితాలు ఉన్న రైతులు గ్రామ సచివాలయంలో కానీ మీసేవ కేంద్రాల ద్వారా సాదా బైనామాల క్రమబద్ధీకరణ కోసం సంబంధిత తహసీల్దారులకు ఈ ఏడాది డిసెంబర్ 31 లోపు అర్జీలు దాఖలు పరుచుకోవాలన్నారు. 30 రోజుల కాలవ్యవధిలో జీవో ఎంఎస్ నెంబర్ 661 నిబంధనల ప్రకారం విచారించి క్రమబద్ధీకరణ చేయడం జరుగుతుందన్నారు. క్రమబద్ధీకరణలో సన్న, చిన్నకారు రైతులకు రిజిస్ట్రేషన్ రుసుం కూడా పూర్తిగా మినహాయింపు ఉంటుందన్నారు. క్రమబద్ధీకరణ కేవలం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పట్టా భూములకు మాత్రమే వర్తిస్తుందని, అసైన్‌మెంట్, డీకే పట్టాల విషయంలో జరిగిన అగ్రిమెంట్లకు, భాగ పంపిణీలు, వీలునామాలు క్రమబద్ధీకరణ పరిధిలోకి రావన్నారు. గతంలో కంటే ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలు రైతు సోదరులకు అనుకూలంగా, సరళతరంగా ఉన్నాయన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎన్ రాజకుమారి, తహసీల్దార్ కె.నగేష్, ఎంపీటీసీ కె.రమేష్‌రెడ్డి, సర్పంచ్ తిప్పిరెడ్డి సుజా త, పాకాలపాడు సొసైటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

గుంటూరు రూరల్: యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని లాంఫాం వ్యవసాయ పరిశోధనా స్థానం సహపరిశోధనా సంచాలకుడు(ఏడీఆర్) డాక్టర్ జి.సుబ్బారావు పేర్కొన్నారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఏరువాక కేంద్రం జిల్లా సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పంటలు ఆశాజనకంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ జి.కిషోర్‌బాబు మాట్లాడుతూ వరి చిరుసంచి రకం బీపీటీ 3082 రకం 136 రోజుల్లో పంటకాలం పూర్తి చేసుకుని హెక్టారుకు 6,285 కిలోల దిగుబడిని ఇచ్చిందని వివరించారు.